# శ్రీ రమణ జ్యోతి

సంపుట-43 సంచిక - 6 హైదరాబాదు జూన, 2023 పేజీలు - 52 రూ. 10/- సంవత్సరం చందా : రూ. 100/-

# SRI RAMANA JYOTHI

Vol - 43 Issue - 6 Hyderabad June, 2023 Pages - 52 Rs. 10/- Annual Subscription Rs. 100/-



BHAGAVAN SRI RAMANA MAHARSHI



*ARUNACHALA HILL* (అరుణాచల గిరి)

స్మరణమా త్రముననె పరముక్తి ఫలద । కరుణామృ తజలధి యరుణాచ లమిది ॥

శ్రీ రమణ జ్యోతి

జూన్ 2023

ఈ సంచికలో ...

# Sri Ramana Jyothi

June 2023

IN THIS ISSUE ...


| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.యస్. గారి 107వ ప్రవచనం | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | శ్రీదేవీ కాలోత్తర జ్ఞానాచార విభాగము | తాడిమేటి సత్యనారాయణ | 18 |
| 3. | శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు (శ్రీ దేవరాజ ముదలియార్) | జి. శ్రీహరిరావు | 21 |
| 4. | శ్రీ భగవాన్ రమణ మహర్షి భక్తాగ్రేసరులు | మల్లాది ఫణిమాల | 26 |
| 5. | "I am Nobody's Guru" | Dr K Subrahmanian | 30 |
| 8. | Ashtavakra Gita - 13 | V Krithivasan | 42 |
| 7. | Ramana Yoga Sutras | Sri Krishna Bhikshu | 45 |
| 8. | A Scientist becomes a Vedantin | | 48 |


## Events in Sri Ramana Kendram in June 2023

1. Satsang - Every Sunday - 9.00 - 10.45 a.m.
2. 20th - Punarvasu Satsang - 6.30 - 7.30 p.m.
3. 3rd Sunday - Meditation - 9.00 - 10.45 a.m.

(పాఠకులు దయచేసి తమ ఫోన్ నంబరు,e- మెయిల్ అడ్రెస్, శ్రీ రమణకేంద్రం ఆఫీసుకు వెంటనే ఫోన్ చేయగలరు)

(Readers are requested to kindly intimate the Sri Ramana Kendram Office, their Phone Number and e-mail address)


© Copyrights of all the material used from Sri Ramanasramam publications in Sri Ramana Jyothi either in excerpted form, translated form or serialised form totally belong to Sri Ramanasramam, Tiruvannamalai.


**శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు: కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్**
**(వ్యవస్థాపక అధ్యక్షులు, శ్రీరమణకేంద్రం)**

# సత్కార్యానికి సహకరించడం సమంజసం

డా॥ కే.యస్. గారి 107వ ప్రవచనం

అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి

ఇతరులను అనుకరించడం వల్ల మనకు అసంతృప్తి, దుఃఖము, కలుగుతుంటాయి. మరింతగా ధనాన్ని, సంపదను చేర్చుకొనడం వల్ల మనకు సుఖం కలుగదు. మనకు ఉన్న దానినే ఎంతో సవ్యంగా ఉపయోగించడంలోనే సుఖంగా వుంటాం. ఇతరులతో గొప్పవాడి ననిపించుకోవడం కోసం మనం మరింతగా ఆర్జిస్తాం. ఉన్నదానితో తృప్తి చెందే వ్యక్తియే ఈ ప్రపంచంలో అత్యంత సౌఖ్యాన్ని అనుభవిస్తాడు. రెండు పూటలా తినడానికి, ఉండేందుకు ఒక ఇల్లు, జీవనం గడపడానికి కొంత డబ్బు వున్నప్పుడు అలా సంపాదిస్తూ వుండడంలో అర్థం లేదు. జబ్బు చేస్తే డబ్బు కావలసి వస్తుంది, వృద్ధాప్యానికి డబ్బు వుండాలి అని ఆలోచిస్తాం. ఎంత ధనం అవసరం? ఈ ఆలోచనలతో గడిపి నప్పుడు, ఇక పని చేయలేని స్థితికి చేరేవరకు సంపాదిస్తూనే వుండాలనిపిస్తుంది.

## లోభిగా వుండడం కాదు

పొదుపుగా వుంటే, సౌకర్యవంతంగా వుండ గలుగుతాం. భగవాన్ ఈ విశ్వప్రభువు. ఏదీ వ్యర్థం చేసేవారు కాదు. కుటుంబం సంగతి అలా ప్రక్కన పెడితే, మన కోసం ఖర్చు పెట్టనవసరం లేదు. ఇది ఎందుకు అవసరం? మనం మోతాదుగా ఖర్చుపెడితే,

ఇతరులకు కొంతైన ఇవ్వగలుగాతమన్నది ఉద్దేశం. కొందరు అనుకునేలాగ పొదుపు చేయడమంటే లోభిగా వుండమని కాదు. బ్యాంకులో ధనం చేర్చడమని కాదు, ఏమీలేని కనీసం ఒకరిద్దరికి సహాయపడవచ్చునని. మనం గొప్పగా ఇవ్వలేమని అనుకోవచ్చు. ఇచ్చే ఒక రెండు వందలు కూడ వాళ్ళకు ఎంతో ఎక్కువ అని అనిపిస్తుంది. కాని ఇతరులకు ఇవ్వాలనే సరికి మనం ఎంతో లెక్కలు కడతాం. ఆ యాచకునికి ఎందరో ఇస్తూ వుండి వుంటారు కదా, మనం ఎందుకు ఇవ్వాలి అనిపిస్తుంది.

మరి మన కోరికల విషయంలో కూడ అదే ధోరణిని చూపిస్తామా? ఎక్కువ సమయాన్ని మనం కావలసిన వాటిని సమకూర్చుకొనడంలో ఖర్చు పెట్టకూడదని భావిస్తామా? ఇతరుల కోసం ఖర్చు పెట్టే సమయం, సహాయాలు మనకు ఎంతో తృప్తిని ఇస్తాయి. ఎదుటివారు మరింతగా తృప్తిని చెందుతారు. అంటే స్వవిషయాలకు కాదు, ఇతరుల కోరికలు, కనీస అవసరాలు తీర్చడం ముఖ్యమని గమనించాలి. సమయాన్ని దాని కోసం వెచ్చించడంలో లెక్కలు కట్టడం అనవసరం కదా! కాని అక్కడ కూడ మనకు సమయం ముఖ్యం, ఆనందించడానికి ఉపయోగపరచుకోవాలన్న అభిప్రాయానికి వస్తాం. దేవుడు మనకు ఎన్నో ఇస్తాడు. కాని మన ఎదుట అగపడి వాటి కోసం కృతజ్ఞత తెలపమని అడుగుతాడా? అలాంటిది ఏమీ వుండదు. కాని ఏదో చెప్పలేని కారణం వల్ల ఎదుటి వారికి చేసిన సహాయం మనకు అంతులేని తృప్తిని ఇస్తుంది.

ఇవ్వడం అంటే తిరిగి మనకేదో దాని ద్వారా లభించాలని అనుకొనక పోవడం. అలాంటి దాతృత్వభావన భగవంతుని కృప ద్వారా మాత్రమే లభిస్తుంది. ఒక జ్ఞాని, లేదా సన్యాసికి మనం ఏదైనా సమర్పించుకుంటే, ఆయన దాని కోసం ఆశించడు. సహృదయంతో, అంకిత భావంతో ఇవ్వగలిగిన దేనినైనా ఆయన ముందు వుంచినప్పుడు, ఆ గొప్ప వ్యక్తి దృష్టి దానిపై పడినంతనే మనకు మనశ్శాంతి కలుగుతుంది. ఎంతో మంచి జరుగుతుంది. అలాంటివి మన స్వంత కృషి, తెలివితేటల వల్ల కలిగినవి అని అనుకుంటే అది అవివేకం. మహాత్ముల దీవెనలు వాటికి కారణం.

ఆదిశంకరులు 12, 13 సం॥ల వయసులో ఇంటింటికి వెళ్ళి భిక్ష అడిగేవారు. ఒకసారి ఒక ఇంటి ముందు నిలబడి 'భిక్షాందేహి' అన్నారు. ఆ ఇంటి పురుషుడు తాను భిక్షకై బయటికి వెళ్ళాడు. కుటుంబం పేదరికంలో మగ్గుతోంది. ఆ గృహిణికి శరీర ఆచ్ఛాదనకు కనీస వస్త్రం కూడ లేదు. ఇంట్లో ఏమీ లేదు. తమ ఇంటి ముందుకు వచ్చి భిక్ష అడిగిన శంకరుని తేజస్సుకు ఆమె నివ్వెర పోయింది. ఇంట్లో గుప్పెడు బియ్యం కూడ లేని పరిస్థితి. ఆమెకు దిక్కు తోచలేదు. ఇల్లు మొత్తం వెదికితే ఆఖరుకు ఒక ఎండిపోయిన ఉసరిక కాయ కనిపించింది. చేతులతో శరీరాన్ని కప్పుకుంటూ వచ్చి ఆ ఉసిరికను శంకరుల భిక్షా పాత్రలో వుంచింది.

**మహాలక్ష్మి ప్రసాదం**

శంకరులు పరిస్థితిని గమనించాడు. ఇంటివైపు చూస్తే మొత్తం అతి దీనస్థితిలో వుంది. ఇచ్చిన భిక్షను చూశాడు, కన్నీటి పర్యంతం

అయ్యాడు. ఎంతటి దీనస్థితి అని బాధపడుతూ, సకల సంపదలను ప్రసాదించే దేవి మహాలక్ష్మిని స్తుతి చేశాడు. శ్లోకాలు ఒక దాని వెంబడి ఒకటి ధారావాహికంగా వచ్చాయి. అది కనకధారాస్తోత్ర రూపం తీసుకుంది. ''ఓ మాతా! ఈ కుటుంబం పరిస్థితిని బాగుపర్చమని అమ్మవారిని అర్థించాడు. స్తోత్రం ముగిసేసరికి బంగారం వర్షంగా కురిసింది. కొందరు అది అసాధ్యం, నిజం కాదని అనుకోవచ్చు.

నిజ జీవితంలో మనం అప్పుడప్పుడు విచిత్ర సంఘటనలు చూస్తాం, లేదా వింటుంటాం. ఒక లారీ నిండుగా డబ్బు నోట్లు తీసుకుపోతున్నప్పుడు ఒక సంచీలోని నోట్లు చెల్లా చెదురై ఎగిరి చుట్టూ రోడ్డు మీద మొత్తం పడుతూపోతే, దారి వెంబడి వెళ్తున్న వారు చేతికి అందినంత తీసుకుపోయిన సంఘటనలు అరుదుగా వింటూనే వుంటాం. మరి కొన్ని సందర్భాలలో ఎవరో త్రవ్వినప్పుడు బంగారం బయట పడినట్లు చెబుతుంటారు. ఇవి కేవలం విపరీతాలు అనుకుంటాం, కాని ఎక్కడో జరుగుతూనే వుంటాయి.

హంపీలోని చారిత్రక శిథిలాలను గురించి తెలిసినదే అక్కడ విజయనగర సామ్రాజ్యం ఒకప్పుడు వెలిసింది. ఒక నిరుపేద వ్యక్తి ఉగ్రతపస్సు చేసినప్పుడు మహాలక్ష్మి ప్రత్యక్షమై ''ఈ జన్మలో నీవు ధనవంతుడు కాలేవు. కాని నీకు అవసరమైనది లభిస్తుంది'' అన్నది. కాని ఆ వ్యక్తి విద్యారణ్యుడు బ్రహ్మాండమైన ధనం కావాలన్నాడు. ''అది నీకు ఈ జన్మలో దొరకదు అని ఆమె అన్నది. మేధావి అయిన విద్యారణ్యుడు సన్యాసం తీసుకున్నాడు. సన్యాసం పుచ్చుకున్న వారికి ఆ తరువాతది మరొక జన్మ. వారు పూర్వ జన్మను వదిలేసి

క్రొత్త వ్యక్తులవుతారు. అందుకని అతను మళ్ళీ తపస్సు చేసి మహాలక్ష్మిని ప్రత్యక్షం చేసుకున్నాడు. క్రొత్త జన్మ గనుక అపారమైన సంపదను ప్రసాదించమని కోరాడు. కథనం ప్రకారం వెంటనే బంగారు వర్షం కురియడంతో అధిక ధనవంతుడయ్యాడు. అంతటి బంగారాన్ని చూసేసరికి విద్యారణ్యుడు చాలా సంతోషించాడు. కాని అదే సమయంలో అతనికి మరొక ఆలోచన వచ్చింది. సన్యాసులు ధనాన్ని ముట్టరాదు. తన మూర్ఖపు పనికి చింతించాడు.

**అనుకున్న సమయంలో కుదరదు**

తరచు, జీవితంలో మనకు కోరినది లభించవచ్చు. కాని అది తాను కావాలనుకున్న సమయంలో లభించదు. చిన్న వయసులో ఒక సైకిల్ కావాలనుకుంటే, మనుమడు పుట్టే సమయానికి లభించ వచ్చు. విద్యారణ్యుల విషయంలో జరిగిందదే. ఇదేదో కట్టు కథ కాదు. చరిత్రలో జరిగినది. దేవి తనకు ఏదో ఒక ఉద్దేశంతో నాకు ఇంత ధనం ప్రసాదించింది. నా కోసమని ప్రార్థించాను. కాని మరొక కార్యానికి దీనిని వాడతాను అని విద్యారణ్యులు తలచాడు.

ఆ రోజుల్లో దేశం యొక్క దక్షిణాదిన మొత్తం మైసూరు నుండి రామేశ్వరం వరకు ముస్లింలు దండయాత్ర చేశారు. మల్లిక్ గఫూర్ గురించి మీరు విని వుంటారు. ఆనందయాత్రలో నాశనం చేయబడిన అనేక దేవాలయాల్లో ఒక దానిని వేరొక చోట అందంగా పునర్మించారు కూడ. ఎన్నో దేవ, దేవతా విగ్రహ మూర్తులను వికృత పరచడం జరిగింది. ఒక్క అలంపూరులోనే ఎన్నో చోట్ల దేవాలయాలు అలా ధ్వంసం చేయబడ్డాయి. అలా విధ్వంసం

చేస్తున్న వారిని అదుపు చేయడానికే మహాలక్ష్మి నాకు ఇంత సంపదను ప్రసాదించిందని విద్యారణ్యులకు అర్థమైంది. ఈ విషయంలో హరి, హర అనే ఇద్దరు పశుకాపరులను విద్యారణ్యులు గుర్తించి, ఆ సంపదను ఇచ్చి రాజులుగా చేసి సమయానుకూలంగా సలహాలను ఇచ్చాడు. వారిని ఆ విషయంలో శక్తిమంతులుగా చేశాడు. అలాగ విజయనగర సామ్రాజ్యం ఏర్పడింది. శ్రీకృష్ణ దేవరాయలతో ఇది సంబంధం లేనిది. ఇది విద్యారణ్యుల కృషి వల్ల ఏర్పడింది.

శంకరాచార్యుల విషయంలో మీలో కొందరికి అనుమానాలు వుంటే వుండవచ్చునేమోగాని విద్యారణ్యులకు సంబంధించినంత వరకు ఇది చరిత్ర పుస్తకాలలో నమోదు చేయబడినదే. ఒక సామ్రాజ్య స్థాపన కోసం విద్యారణ్యులకు అంత సంపద ఇవ్వబడింది. మన పరిమిత మనస్సుతో మనకు అవగాహన లేకపోవచ్చు. స్వయంగా శివస్వరూపులైన శంకరాచార్యుల నుండి మౌఖికంగా బయలు వెడలిన కనకధారాస్తోత్ర పఠనం ఎంతో గొప్ప అనుభవాన్ని ఇవ్వడమే గాకుండ ఏ విధమైన లోటును లేకుండ చేస్తుంది. ప్రపంచంలోని మొత్తం సంపద మనకు లభించినప్పటికి, అది మనకు సంతోషాన్ని ఇవ్వలేదు. ఎవరైనా ధనాన్ని ఇవ్వడానికి ముందుకు వస్తే, దాన్ని స్వీకరించాలని భగవాన్ చెప్పారు. నీకు అవసరం లేకపోవచ్చు. కాని ఏదో విధంగా అది అవసరమున్న వారికి చేరేలాగ చూడాలన్నారు. భగవాన్‌కు ఎన్నో ఇచ్చేవారు. కాని అతనికి అవసరం, ఆయనకు ఇవ్వమనే వారు. అదే తినే వస్తువు అయితే అందరికీ దాన్ని పంచమనేవారు.

## సర్వజ్ఞులు భగవాన్

భగవాన్ సర్వజ్ఞులనడానికి పలు ఉదాహరణలున్నాయి. ఒకసారి పాదరక్షలు తొడుక్కునే (షూ హార్న్) ఒక చోట కనబడింది. దాన్ని పడేయకండి. ఆస్‌బార్న్‌కు అవసరమవుతుంది వచ్చినప్పుడు ఇమ్మన్నారట. ఆంగ్లేయుడైన ఆస్‌బార్న్ పాదరక్షలు తొడుక్కునేవారు. స్వయంగా ఆస్‌బార్న్ ఈ విషయం గురించి వ్రాస్తూ, ఎంత దయామయులని భగవాన్‌ను పొగిడాడు. బహుశః ఆయన కుటుంబం దాన్ని ఇప్పటికీ ఉంచుకొని వుండవచ్చు. ఏ వస్తువునూ వృథాచేయకూడదు. లభించిన దానిని పడేయక అవసరం వున్న వాళ్ళకు ఇవ్వడం మనకు మరింత సంతోషాన్ని ఇస్తుంది. మనకూ వున్నాయని చెప్పుకొనడానికి మనకు ఎన్నో వుండవచ్చు. జ్ఞానులు ఇతరులకు ఇవ్వడమే ధ్యేయంగా పెట్టుకుంటారు. అలాంటి స్వభావం కలిగి వుండడాన్ని భగవంతుడు సంతోషిస్తాడు. దాంతో మనకు ఎంతో ఆనందం కలుగుతుంది. కాని మనలో చాలామంది లభించిన దానిని చేర్చుకుని వుంచుకోవడంలో ఉత్సాహం చూపుతాం.

సాధారణంగా, ఎదుటివారికి ఇవ్వడంలో మనం శ్రద్ధ చూపం. ఏ ప్రచారమూ లేకుండ, తిరిగి మళ్లీ ఏమీ ఆశించకుండ ఇవ్వడం గురించి ఎంతో మెచ్చుకొనబడింది. కుడి చేతితో ఇచ్చినది ఎడమ చేతికి తెలియనీయకూడదు అని అంటారు. ఒక దుఃఖించ వలసిన విషయమేమంటే మనం ఇతరులకు ఇస్తున్నామన్న విషయం తెలిస్తే అందరూ మెచ్చుకుంటారని అనుకుంటాం. కాని దానితో ఇతరుల్లో అసూయ పెరుగుతుంది. తమను పరోక్షంగా తక్కువ చేస్తున్నారన్న

భావన కూడ కలగవచ్చు. అందుకే ఇవ్వదలచుకున్నదేదో ఏ ఆర్భాటం లేకుండ ఇవ్వాలంటారు. నిజానికి ఇతరులకు ఏమైనా ఇస్తున్నామంటే మనకు మనమే ఇచ్చుకున్నట్లని భగవాన్ అంటారు. భగవంతుని కృపతోనే, అలాంటి అభిప్రాయం ఏర్పడుతుంది. ఇవ్వడం వల్ల వర్ణించలేని విధంగా మనకు ఎంతో మంచి జరుగుతుంది. కొన్ని సమయాల్లో దాని వల్ల మేలు మనకు కాదు, దగ్గరి వారికి ఎవరికో లభించడం కూడ జరుగుతుంది. కాని దాన్ని ముందే ఆశించడం మంచిది కాదు.

## యోగ్యతకు పరీక్షనా?

మహాభారత కురుక్షేత్ర యుద్ధం ముగిసిన తరువాత మహా అన్నదానం జరిగిన సందర్భంలో ఒక విషయం చర్చకు వచ్చింది. అన్ని వేల మందికి భోజన సదుపాయం చేసినప్పుడు ఎందరో సోమరులు, ఏ పని చేయని వారికి అనవసరంగా అన్నదానం చేయడం సమంజసమా? ఆ సందర్భంగా భీష్ముడు ఒక వివేక వంతమైన విషయాన్ని తెలియజేశాడు. అలాంటప్పుడు, చాలామంది ఏ విధంగాను ఉపయోగపడని వారికి అనవసరంగా మేలు జరగడ మన్నది వాస్తవమే కావచ్చు. కాని అసలు విషయమేమంటే అంత మందిలో ఏ ఒక్కడైనా యోగ్యుడు, సన్మార్గుడు భుజించి, ఆశీర్వదిస్తాడు. ఆ ఒక్క ఆశీర్వాదం చాలు. ముందు ఏడు తరాలు, తరువాతి ఏడు తరాలు తరిస్తారని భీష్ముడు అన్నాడు. అందుకే ఇలాంటి విషయాలలో విచక్షణ చూపడం మంచిది కాదు, అందు వల్ల నష్టం మనకే కాని, ఇతరులకు కాదు.

ఇంతకు ముందు చెప్పుకున్న శంకరాచార్యుల కనకధారా స్తోత్రం, విద్యారణ్యుల వారి సామ్రాజ్య స్థాపన విషయాలలో మనం గుర్తుంచుకోవలసినది నమ్మకం. వస్తు సేకరణ, సంపదలను అధికం చేసుకొనడం వల్ల సుఖశాంతులు లభించవు. జీవనస్థాయిని పెంచడం ముఖ్యం కాదు. జీవన నాణ్యతను అధికం చేసుకోవాలి. భగవాన్ పేదల్లో, నిరుపేద జీవితాన్ని గడిపారు. ఒకసారి ఒక రాజు భగవాన్ సందర్శనానికి వచ్చారు. "నేను భగవాన్ ఎదుట నిలబడితే, నేను నగ్నంగా వున్న భావన కలిగింది. ఆయన నాకు చక్రవర్తిలాగ అనిపించారు. మీరు, నేను ధరించే దస్తులు కారణం కాదు. భగవాన్ శరీరం ఒక గొప్ప దైవిక శోభ, ప్రకాశంతో కప్పబడి వున్నాయి అన్నారు. మన యొక్క అహం కారణంగా దుస్తులున్నప్పటికి నగ్నంగా వున్న భావన ఏర్పడుతుంది" మన మతం యొక్క ప్రాథమిక ప్రాతిపదిక, కోరికలను, సంపద అభివృద్ధి ధ్యేయం కాదు. ఇతరులకు ఇవ్వడం, అది కూడ సద్భావంతో ఇవ్వడం ముఖ్యం.

కృష్ణుడు తనకు ఏదో ఒక పత్రం, పుష్పం, ఫలం కనీసం తోయం (నీరు) సమర్పించుకొన్నప్పటికీ అదే చాలునన్నారు. హనుమంతుడు సీతమ్మను కనుగొన్న తరువాత లంక నుండి తిరిగి వచ్చి ఆమె క్షేమంగా వుందని శ్రీరామునితో చెప్పాడు. అప్పుడు శ్రీరాముడు "నాకు అమిత సంతోషాన్ని కలిగించావు. ఇప్పుడు గనుక నేను అయోధ్యలో వుండి వుంటే నిన్ను కానుకలతో ముంచెత్తి వుండేవాడిని. ప్రస్తుతం నా సంగతి చూస్తున్నావు. నేను ఇవ్వగలిగింది ఇది ఒక్కటే" అని హనుమంతుడిని గాఢంగా కౌగలించుకున్నాడు. హనుమాన్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఒకవేళ శ్రీరాముడు

ఆభరణాలు, ఆ మాటకొస్తే మొత్తం అయోధ్యను ఇచ్చి వుండినప్పటికి హనుమకు ఏ సంతోషమూ కలిగి వుండేది కాదు. శ్రీరాముడు తననే సమర్పించుకున్నాడు అందుకే ఇచ్చేది ఎంత అన్నది కాదు. ఏ భావాలతో ఇస్తున్నామన్నదే ముఖ్యం.

**కోట్ల విలువ చిరునవ్వు**

భక్తులు భగవాన్‌ను దర్శించుకున్నప్పుడు, వాళ్ళకు ఒక్క విషయమే గుర్తుండేది - ఆయన తమ వైపు అమిత ప్రశాంతంగా చూసి ఇచ్చిన చిరునవ్వు. అది కోట్లాది రూపాయల కంటే విలువైనది. ఏ లౌకిక సంపద కంటే కూడ గొప్పది. తన సమయం, సౌకర్యం అన్నవి పట్టించుకోకుండ, రాత్రి పగలనక విరామం లేకుండ వుండిన ఆ సౌలభ్యత ఏ సంపదకూ సమానం కాదు. డబ్బు ఇవ్వడం కాదు, ఆయా సమయ, సందర్భాలను బట్టి ఆర్తిలో వున్న వారికి ఓదార్పు, శాంతిని ప్రసాదించడం అన్నిటికంటే గొప్ప విషయం.

ఒక గొప్ప మహానుభావునికి, సామాన్య వ్యక్తికి తేడా ఏమిటి? మామూలు వ్యక్తి అంతా తనదేననుకుంటాడు. మహాత్ముడు తాను అందరికీ చెందిన వాడిననుకుంటాడు. మొత్తం ప్రపంచం తన కుటుంబం అనుకుంటాడు. అందరూ అతను తమ వాడను కొంటారు. భగవాన్ ఏ ప్రతిఫలాన్ని ఆశించకుండ పూర్తిగా తమను సమర్పించుకున్నారు. ఏ హిమాలయాలకో వెళ్ళి ఏకాంతాన్ని అనుభవించక నిరంతరం ప్రజలకు అందుబాటులో వుండి పోయారు. మనం భగవాన్ కాదు గాబట్టి మనం అలాగ వుండలేము.

# శ్రీ దేవీ కాలోత్తర జ్ఞానాచారవిచార విభాగము

(గత సంచిక తరువాయి) **తాడిమేటి సత్యనారాయణ**

## 72వ పద్య తాత్పర్యము

ముందుచెప్పిన ఆ మంత్రజపములచే, ప్రాణులకు జ్వరము రప్పించుట, భూతములను, గ్రహములను యితరులపై ఆవాహన చేయుట, ఆవేశము ప్రవేశింపచేయుట, బలాత్కారముగ వశపరచు కొనుట, ఇతరులను తన వైపు ఆకర్షించుకొనుట, మోహము నొందునట్లు చేయుట, అనబడు యిటువంటి హీనమైన క్షుద్ర కర్మములను చేయకుము. రాళ్ళ చేతనో, కొయ్యల చేతనో, వాటి వలె నుండు వస్తువుల చేత చేయబడిన రూపములకు పూజలు చేయుట పూర్తిగ వదలివేయుము.

## వ్యాఖ్య

ప్రాణులకు జ్వరము రావడం సహజము. అట్లుగాక మంత్ర ప్రయోగము వల్ల వచ్చు జ్వరము మందులకు లొంగదు. మంత్ర ఉచ్చారణ ఆపిననే జ్వరము తగ్గును. ఈ విధముగనే భూతములను గ్రహములను మంత్రములచే ఆవహింప జేసి, ఎనలేని కష్టములను, క్లేశములను కలుగజేయుటయగును. బాగున్న వాడిని అకస్మాత్తుగ ఆవేశపరులను చేయుట కూడ అటువంటిది. ఈ ఆవేశమునకు కారణమే వుండదు.

దుర్మార్గముగా తనకు వశపరచుకొనుట. ఇట్లు వశమైనవాడు, ఇష్టము లేకపోయినను అతనికి లోబడి యుండును. ఇతరులను

తనవైపు ఆకర్షించుకొనుట, మోహమునొందునట్లు చేయుట మొదలైనవి అనేకములు క్షుద్రకర్మలని చెప్పబడుచున్నవి.

క్షుద్ర దేవతలను ఉపాసించి, ఆ దేవతా మంత్రములను జపించి అందు సిద్ధి పొంది, ఈ కఠోరమైన కార్యములను క్షుద్రోపాసకుడు చేయుచున్నాడు. ఇందు ఏ ఒక్కటియును చేయ తగినది కాదు. వీటినన్నిటినీ వేరుతో సహా పెకలించి నాశనము చేయవలెను.

ఈ క్షుత్రమంత్ర ప్రయోగములు చేయునపుడు, ఆ ప్రయోగమును, రాతి చేతనో, కొయ్య చేతనో, మట్టిపెంకు చేతనో రూపముచేసి, అందు మంత్రము ప్రయోగించి ఉచ్ఛాటనము చేయుదురు. దీనినే నిషేధించుమని బోధించుచున్నారు.

వివేకియగు సాధకుడు పైన చెప్పిన ఏ కార్యమును చేయ కూడదని గట్టిగా చెప్పుచున్నారు.

**73వ పద్య తాత్పర్యము**

క్షేత్ర పీఠమునందు గోచరమగు దేవతల కొరకై, ఆయా స్థలములపై (స్థానములపై) మనస్సును (లయించి) నిలుపునపుడు, దానిని సూచించు ముద్రలను, వాటి నుద్దేశించి చేయు యాగములను వదలి, ఇంతకుముందు వాటిని చేయుట వలన కలిగిన వాసనలను నాశమొనరించి, అంతటా వ్యాపించి ప్రకాశించు సుజ్ఞానమగు చిత్స్వరూపమునే ధ్యానింపుము.

**వ్యాఖ్య**

క్షేత్ర పీఠములనగా షడాధార చక్రములు. ఆ చక్రములందు అధిష్ఠానమైన వారు దేవతలు. ఈ షడాధారముల స్థానములలో,

మనసును వేర్వేరు స్థానములలో నిలిపినపుడు, ఆయా దేవతల కొరకు చూపబడునది మహాముద్రలగును. పైగా వీటినుద్దేశించి చేయబడు పలురకములైన యాగములున్నవి. వీటినన్నిటినీ చేయుట మానవలెనని చెప్పుచున్నారు. అంతటితో ఆగక, యింతకాలము వాటిని చేయుట వల్ల కలిగిన వాసనలను పూర్తిగా తొలగింపుమని తెలుపుచున్నారు. కార్యరూపముగా బయట చేయుటను మాని, మనస్సున దాని గురించిన ఆలోచనకు కూడా తావీయక యుండవలెనని భావము.

అభ్యాసి చేయవలసినదంతా చిత్స్వరూప ధ్యానమే. మనస్సు అందు లగ్నమగుటచే మిగిలినవన్నియు తామే వదలిపోవుచున్నవి. స్వరూపధ్యానము చేయు మనస్సునకు ఏదియును అంటవు. ప్రపంచ బంధములవలె, ఆధ్యాత్మికములు కూడ వాసనలేయని బోధించి దేని గురించి ఆలోచించక మనస్సును ఆత్మచింతనలో నుంచుమని ఉపదేశించుచున్నారు.

## 74వ పద్య తాత్పర్యము

అన్ని వస్తువులయందు సమదృష్టి గలిగినవాడనై, ఏ వస్తువు నందును ఆశాపాశములు లేక, సుఖదుఃఖములు కల్గినపుడు వాటియందు సమభావము గల్గి, ప్రాణ స్నేహితులు, విరోధులు, వారిద్దరియందును సమదృష్టిగలవాడవై, విరిగిన మట్టికుండ యందును, విలువైన బంగారమందును, సమబుద్ధిగలవాడై యుండుము.

**వ్యాఖ్య**

చూచే ప్రతి వస్తువు నందు సమభావము గలవాడవైయుండు మను దానిని ఉదాహరణతో వివరించుచున్నారు. మనిషి భావము పేదలను బలహీనులను చూచినపుడు వుదాసీనముగా యుండు నట్లు. గొప్ప వస్తువులను చూచునపుడు యుండుటలేదు. వాటిపై మక్కువ పెంచుకొని అభిమానముతో కులుకుచున్నాడు. ఈ విభేద ములను వదలి సమభావముతో నుండవలెనని చెప్పుచున్నారు.

జీవితములో సుఖదుఃఖములు సంభవించునపుడు, సుఖము కల్గినచో సంతోషము, కష్టములు కలిగినపుడు దుఃఖము చెందక, సమభావముతో నుండుట అవశ్యము. ఈ విధముగనే ప్రాణ సమానమైన ఆప్తస్నేహితుని చూచినచో మనస్సు పొంగి, విరోధిని చూచినచో మనస్సు ఆగ్రహము చెంది, పగతో రగిలిపోక, ఇద్దరి యందు సమదృష్టి గలవాడై, ఎటువంటి వ్యత్యాసము చూపించ వలదు.

పగిలిన మట్టిపెంకుపై ఎటువంటి భావముగలదో, విలువైన మాణిక్యము పైననూ అదే భావము యుండవలెను. ఎటువంటి తారతమ్యములు లేక సమానముగా యుండవలెను. దీనికొక ఉదాహరణము. శైవభక్తులు శ్రీ అప్పర్ తిరుప్పగలూరు క్షేత్రము నందుండి అనేక పదములు పాడి భగవంతుని స్తుతించిరి. అప్పర్ గారికి మట్టియందు బంగారమునందు ఎటువంటి ఆశలు లేని వారని లోకులకు తెలుపుటకు శివుడు దేవాలయమునకు ముంగిట అప్పర్ స్వామి శుభ్రము చేయుచున్నప్పుడు, ఆయన, ఆయనతోడి

అనుచరులు శుభ్రపరచు స్థలమంతయు, అమూల్యమైన నవరత్నములను, మాణిక్యములను పరచియుంచిరి. దానిని చూచిన శ్రీ అప్పర్, వాటిని గులకరాళ్ళవలె ఎంచి, వాటిని తన అనుచరులు చేత తీయించి పారవైచిరి. శివభక్తులకు పెంకులు బంగారమును ఒకే విధముగ చూచుట యనునది సహజమైన గుణము. ఇదియే శ్రీ అప్పర్ విషయములో రుజువైనది.

సాధకునకు సమదృష్టి లేనిచో, అంతటా నిండిన బ్రహ్మమును చూడలేడు.

### 75వ పద్య తాత్పర్యము

ఇంద్రియములచే అనుభవింపదగు విషయములలో, మనస్సును ఎప్పుడూ వాటిని ఆశించనీయక, నాదియను మమకారమును నిర్మూలించినచో, బుద్ధి బలహీనత పోయి దృఢత్వమునొంది, దేనియందును భయమో ఆశయో లేక, ఎల్లప్పుడు ఆత్మస్వరూపమున రమించుచుండును. అట్లు రమించు వాడే మచ్చలేని మహాయోగి యగునని గ్రహింపుము.

### వ్యాఖ్య

ఇంద్రియములచే అనుభవించు సుఖానుభవములను ఏ రోజూ మనస్సన యిచ్ఛతో బంధింపవలదు. ఇంద్రియ విషయములు బహిర్గతముగానున్ననూ, వాటిని పట్టిన ఆశలు లోపల అణగియుండుటచేతనే, అవి తనకే సొంతమైనవని తలంచు చున్నాడు. దీనినే మమకారమని చెప్పబడుచున్నది. జీవుని జీవితము

నాశనమొందుటకు అహంకార మమకారములను ఈ రెండూ మహాశక్తిమంతమైనవి.

బయట వున్నంత వరకు నాదని తలచు మమకారమును పూర్తిగ నాశము చేసిన, పట్టుకొనుటకు విషయములు లేక అహంకారము తానే అణగిపోవును, అందులకే "వాటిని ఆశించ నీయక నాదను మమకారమును నిర్మూలించి" యని సూచించు చున్నారు.

శక్తివంతమైన అహంకార మమకారములను నిర్మూలించు టకు, బుద్ధి అతి బలవంతమైనదిగా నుండిననే వీలగును. అట్లు బుద్ధి బలముగల ధీరుణ్ణి ఆశగాని భయము గాని చేరలేవు. ఆశా భయ రహితుడై సదా ఆత్మలో రమించువాడే మహాయోగి.

## 76వ పద్య తాత్పర్యము

ఇతరుల నిందా స్తుతులలోను, దుఃఖమో సంతోషమో లేక రెంటియందు సమభావము గలవాడై, అన్ని ప్రాణులయందు సమ మనస్కుడై, ఎప్పటికీ ఆ సమభావమునుండి కొంచెమైననూ మారక, తన వంటి అన్ని ప్రాణులయందును సమభావముతో నుండ వలెను. కాబట్టి అటులనే యుండుము.

## వ్యాఖ్య

ఇంతకు ముందు గద్యములో చెప్పబడిన మచ్చలేని యోగియైనవాడు యుండవలసిన సమదృష్టిని గూర్చి ఈ వచనమున చెప్పుచున్నారు. తనను ఎవరు ఎన్ని హీనమైన

మాటలన్ననూ పట్టించుకొనక సమభావముతో నున్నచో మనసు బాధపడదు. ఆ విధముగనే ఇతరులు తనను పొగడ్తలతో ముంచి నపుడు సమాన దృష్టి నుంచి జారక యుండినచో వాటివల్ల ఏర్పడు కష్టసుఖములు అతనిని ఏమియు బాధించవు. ఇట్లు యోగియైన వాడు నిరంతరము సమభావము నందుండి, ప్రాణులలో సర్పమైననూ, గోవైననూ సమదృష్టి గలవాడై యుండవలెను. పైన చెప్పిన ఇన్ని సమభావములు, ఒకని యందు కలిగి స్థిరముగా వుండవలెనన్నచో యోగియగు నిరహంకారికే సాధ్యమగును. నిరహంకారమను ఉన్నతమైన స్థితిని వివరించి గ్రహింపచేసి, అహంకారము నశించు యుపాయములను ముందుగనే ఇక్కడ తెలుపుచున్నారు.

## 77వ పద్య తాత్పర్యము

ఇతరులతో ఉపయోగములేని తర్కవాదములను చేయుటనూ, ప్రపంచ వ్యవహారములను విచారించు లౌకిక గోష్ఠులనూ త్రోసిపుచ్చుము. మనఃక్లేశములకు కారణములైన చెడ్డ కలహములను తప్పించుము. ఇంకా అనేక శాస్త్రముల నభ్యసించిన పండిత గోష్ఠులనూ చేరక వదలివేయుము. దూషించు చెడ్డ మాటలతో బాటు పొగడుతున్న మంచి మాటలనూ విడచిపెట్టుము.

## వ్యాఖ్య

వివేకి ఇతరులతో వ్యర్థవాదనకో తర్కమునకో దిగకూడదు. అవి మనస్సుకు క్లేశముతో బాటు, అహంకారమును వృద్ధి చేయును. అహంకార ముండుటచేతనే వాదనలకు దిగుచున్నాడు.

తన వాక్చాతుర్యమును చూపుటకే మనిషిని వెదకుచు పోవుచున్నాడు. కనుక వాదోపవాదములు, దానికి సంబంధించిన లౌకిక గోష్ఠులను త్రోసివేయుమని చెప్పుచున్నారు.

ఒకటిగా నున్న దానిని రెండుగా చేసి, శబ్దముల తుఫానుగా మార్చుట కలహమునకు వున్న కళ. ఈ విధముగనే శాస్త్రములను నేర్చిన పండిత గోష్ఠులు కూడా అపాయములే యని హెచ్చరించు చున్నారు. శాస్త్రము లభ్యసించిన పండితులకు అనుభవము లేక పోవుటచే చర్చలకు దిగుచున్నారు. రుబ్బురోలులో వేసిన వస్తువును త్రిప్పి పిండిచేయుటయే తప్ప, ఆ వస్తువు యొక్క గుణమో, వాసనయో ఆ పాత్రమునకు తెలియనట్లు, వీరు శాస్త్రములను నేర్చుకొని వాటి అనుష్ఠానములను మాత్రము చేస్తూ వాటి అనుభవమును పొందలేని వారు. అందుచే వీరిని త్రోసిపుచ్చుమని చెప్పుచున్నారు.

చివరిగా, నిందించు చెడ్డమాటలను ఉదాసీనముగ త్రోసి పుచ్చినట్లు, స్తుతించు మాటలను కూడా త్రోసివేయుమని చెప్పుచున్నారు. అహంకారము లేచి విజృంభించుటకు పొగడ్తలకన్న ఒక అనుకూలమైన శత్రువు (హిత శత్రువు) వేరేదియు లేదు. పొగడ్తయను వేశ్యాదాస్యమునుండి విడివడుట మిక్కిలి దుర్లభము అని ''ఉన్నది నలుబది - అనుబంధము'' గ్రంథములోని 37వ పద్యములో భగవాన్ చెప్పినది జ్ఞప్తికి తెచ్చుకొనవలయును.

# శ్రీ భగవాన్ రమణమహర్షి స్మృతులు
## (శ్రీదేవరాజ ముదలియార్)

(గత సంచిక తరువాయి) అనువాదం: జి. శ్రీహరిరావు

## ఐదవ అధ్యాయము

ఈ అధ్యాయములో, శ్రీ భగవాన్ నాతో స్వయంగా చెప్పిన కొన్ని విచిత్రమయిన, మహిమాన్వితమయిన సంఘటనలను గురించి తెలియపరిచెదను. నేను వీటిని స్వయంగా చెప్పకపోతే, ఇవన్నీ ఒక మహాత్ముని చుట్టూ చేరిన శిష్యగణం యొక్క ఊహాజనిత కల్పిత గాథలనుకునే అవకాశమున్నది.

పాము, నెమలి బద్ధ శత్రువులు. శ్రీ భగవాన్ స్కందాశ్రమంలో వున్నప్పుడు, వారి సన్నిధిలో ఈ రెండూ, ఒకరి జోలికి ఒకరు వెళ్ళకుండా సంచరించడం రోజువారీ సంఘటన. ఒకరోజు, శ్రీ భగవాన్ కూర్చొనివుండగా ఒక పాము ఆయన శరీరం మీద ఒక వైపు నుంచి యెక్కి రెండవ వైపు దిగి పాకుతూ వెళ్ళిపోయింది. శ్రీ భగవాన్ యే మాత్రమూ చలించలేదు. చాలాసార్లు వారి దగ్గరకు చిరుతపులులొచ్చేవి. శ్రీ భగవాన్ పరిచారకులు భయంతో లోపలికి పారిపోయేవారు. కానీ, శ్రీ భగవాన్ అలాగే కదలకుండా వుండేవారు. చిరుతపులి రాగానే ఒక అరుపు అరిచేది. ఎప్పుడూ, ఆశ్రమ వాసులకు ఎటువంటి అపకారము చేసేది కాదు. తమకి తెలిసిన రెండు అద్భుతాల గురించి శ్రీ భగవాన్ స్వయంగా నాకు తెలిపారు. శ్రీ భగవాన్ పర్వత చరియల్లో వున్న తొలి రోజులలో, ఒక రాత్రి ఒక స్త్రీ తిరువణ్ణామల రైల్వేస్టేషనులో ఒంటరిగా దిగారు. ఒక

జట్కా యెక్కి ఊళ్ళో ఫలానా వీధికి వెళ్ళమని చెప్పిందామె. దుర్మార్గుడయిన ఆ జట్కాతోలేవాడు, ఒక ఏకాంత ప్రదేశానికి తీసుకుపోయి ఆమె నగలు దొంగిలించే ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో ఆకస్మాత్తుగా, ఇద్దరు పోలీసు జవాన్లు వచ్చి, ఆమె ఫిర్యాదు విని, ఆమెను భద్రంగా వెళ్ళవలసిన గమ్యానికి తోడుండి తీసుకు వెళ్ళారు. ఆ జవాన్ల నంబర్లు ఆమె రాసుకున్నారు. తరువాత, వారికి ధన్యవాదాలు తెలుపుకుందామని, వాకబు చేయగా, తిరువణ్ణామల పోలీసు స్టేషన్‌లో అలాంటి వారెవరు లేరని, రాత్రి జరిగిన సంఘటన ఎవరికీ తెలియదనీ అన్నారు. అద్భుతాల గురించి మాట్లాడుతున్నప్పుడు శ్రీ భగవాన్ ఈ విషయం నాకు చెప్పారు.

ఇలాంటిదే ఇంకొక కథ కూడా శ్రీ భగవాన్ ఈ సందర్భములోనే చెప్పారు. మన టి.కె. సుందరేశయ్యరు గారి బంధువులు ఒకరు, మహా గొప్ప భక్తులు. వారు వికలాంగులు. అయినా గిరి ప్రదక్షిణ చేసే వారు. తిరువణ్ణామలలో చాలా సంవత్సరములుండిన వారు. తమ జీవితముతో విసిగిపోయారు. వారు తమ బంధువుల ఇంట్లో, వారి మీదే ఆధారపడి వుండేవారు. తనతో ఆ బంధువులు ప్రవర్తించే తీరుకు చాలా బాధపడి, తిరువణ్ణామలను వీడి యేదైనా గ్రామానికి వెళ్ళిపోయి యెలాగో కష్టపడి తన జీవనం సాగిద్దామనుకున్నారు. ఊరు పొలిమేరలు దాటే లోపలే, పిన్న వయస్సులో వున్న ఒక బ్రాహ్మణ యువకుడు, ఆయన దగ్గరకు వచ్చి "మీకివి అనవసరం" అంటూ, చాలా అమర్యాదాపూర్వకంగా ఆయన చేతి కఱ్ఱ లాగేసుకున్నాడు.

ఆ ముసలాయన కోపం వాగ్రూపం దాల్చే లోపలే, తను వికలాంగుడను కాదని గ్రహించాడు. చేతి కఱ్ఱల సాయం లేకుండానే నడవగలనని తెలుసుకొని ఆనంద పడిపోయాడు. ఈ సంఘటన తనకు స్వయంగా తెలుసునని శ్రీ భగవాన్ తెలియచేశారు. అరుణాచల స్థల పురాణంలో చెప్పబడిన ఒక సంఘటనకూ, యీ కథకు వున్న సామ్యము కూడా శ్రీ భగవాన్ తెలియపరిచారు: వృద్ధుడూ, కుంటివాడూ అయిన ఒక భక్తుడు చేతి కఱ్ఱల సహాయంతో అనేక సంవత్సరాలుగా గిరి ప్రదక్షిణ చేస్తూ వుండే వారు. అలాగే ఆయన ఒకరోజు ప్రదక్షిణ చేస్తూ దాహం తీర్చు కోవడానికి, శ్రీరమాశ్రమానికి ఒకటిన్నర మైళ్ళ దూరంలో ఉన్న శోణ తీర్థంలోనికి వెడుతుండగానే అరుణాచలేశ్వరుడు, ఆయన చేతి కఱ్ఱను లాగి పారేశారట. ఆ క్షణమే. ఆ భక్తుడి కుంటితనము మాయమై మామూలు మనిషై పోయాడట.

ఇలాంటి అద్భుతాలు జరిగాయని తనకు తెలిసినట్లు శ్రీ భగవాన్ చెప్పేవారే కానీ, ఆ మహిమలు ఎవరు చేశారని కానీ, అవి ఎలా జరిగాయని కానీ, శ్రీ భగవాన్ చెప్పేవారు కాదు. శ్రీ భగవాన్ చిరకాల భక్తులు కొందరు, ఆ రెండు మహిమలు శ్రీ భగవాన్ కృతాలే అని నాతో చెప్పారు. నేను కూడా వారితోనే అంగీకరిస్తాను. తమ అపార కరుణ పొంగిపొరలి, భక్తుల కష్టాలను తొలగించాలనే వుద్దేశ్యంతో, శ్రీ భగవాన్ తమ శక్తిని వినియోగించి నప్పటికీ, అది బహిరంగంగా తెలియడం, శ్రీ భగవాన్‌కు ఇష్టముండేది కాదు.

తాము అద్భుతాలు చేయగలనని శ్రీ భగవాన్ ఎప్పుడూ చెప్పేవారు కాదు. పై రెండు సంఘటనలలో కూడా తమ పాత్ర వుందని వారెప్పుడూ చెప్పలేదు. సిద్ధులూ, మహిమలూ ఒక మానసిక వృత్తియనీ, ఆ స్థితిని అధిగమించి అద్వైత స్థితిలో వున్న వారు వీటి పట్ల యెట్టి ఉత్సాహమూ చూపరనీ శ్రీ భగవాన్ అనేవారు. నేను చెప్ప ప్రయత్నించేదేమిటంటే, శ్రీ భగవాన్, ఆ పరబ్రహ్మ స్వరూపంలో ఐక్యమైపోయారు. వారి వల్ల ఇలాంటి మహిమలు ఏమన్నా జరిగినా, అవి మీరూ నేనూ చేసినట్లు సంకల్పించి చేసినవి కాదు. ఏసుక్రీస్తు చేసిన మహిమల గురించి శ్రీ భగవాన్‌ను ప్రశ్నించినప్పుడు, ''క్రీస్తు ఆ మహిమలు చేస్తున్నప్పుడు, తాను ఆ మహిమలు చేస్తున్నానని అనుకునే వారా?'' అనేవారు శ్రీ భగవాన్.

చివరకు మనము అర్థము చేసుకోవలసిందేమిటంటే, శ్రీ భగవాన్ సర్వశక్తి సమాన్వితులయినప్పటికీ, ఆ శక్తుల గురించి వారు బయట వారికి తెలియనిచ్చేవారు కాదు. దీనికి కారణం ఒకటై వుండవచ్చును: శ్రీ భగవాన్ ఈ శక్తుల ఉపయోగము వల్ల వచ్చు పరిణామాలన్నింటికీ అతీతులైననూ, వాటిని తరచుగా వాడినట్లు మనకు కనిపించినా మనలాంటి వాండ్లకు కూడా అట్టి శక్తులు కావలయుననే కోర్కెలు కలుగుటకు ఆస్కారముండును. అందువలన గమ్యము నుండి మనము దారి తప్పి పెడత్రోవలు తొక్కే అవకాశములుండును.

ఒక భక్తుని పట్ల కరుణతో శ్రీ భగవాన్ చేసిన ఒక అద్భుతము నాకు గుర్తుకు వస్తున్నది. అది అద్భుతమనుటలో ఎట్టి

అనుమానమూ లేదు. అది 1946 ప్రాంతము. శ్రీరాజుగోపాలయ్యరు శ్రీ భగవాన్‌కు భక్తులు. ఆయన గృహస్థు; మూడేండ్ల కొడుకుండే వాడు. ఆ కొడుకు పేరు రమణ. చక్కగా వుండేవాడు. అందరికీ నవ్వొచ్చేలాగా ముద్దుగా వుండేవాడు. రోజూ శ్రీ భగవాన్ వద్దకు పరుగిడి సాష్టాంగ నమస్కారము చేసేవాడు. ఒకరోజు, సాయంత్రం ఎనిమిది గంటల ప్రాంతంలో, భక్తులందరూ నిష్క్రమించిన సమయంలో, ఈ అబ్బాయి కాలు మీద పాము కాటు వేసింది. రాజగోపాలయ్యరు, ఆ బాబును తీసుకొని, ఎటువంటి వైద్యానికీ ఎక్కడా ఆగకుండా పరుగు పరుగున శ్రీ భగవాన్ హాలు దగ్గరకు వచ్చారు. అప్పటికే బాలుడి దేహము నీలిరంగుకు మారి, బిగుసుకు పోతున్నది. శ్రీ భగవాన్ తమ చేతులతో, అతనిని నిమురుతూ, "రమణా! నీకేం కాలేదు బాగున్నావు" అన్నారు. మరుక్షణం ఆ బాలునికి స్వస్థత చేకూరింది. రాజగోపాలయ్యరు గారు ఈ విషయం కొంతమందికి చెప్పారు కానీ, ఈ సంఘటన యెక్కువగా ప్రచారం కాలేదు.

శ్రీ భగవాన్ ఈ సిద్ధుల గురించి ఎక్కువగా ప్రస్తావించేవారు కాదు. వాటికి ఎక్కువ ప్రాధాన్యత కూడా యిచ్చేవారు కాదు. అయినా దైవశక్తితో ఇప్పుడు కూడా జరిగే మహిమలను వారు అప్పుడప్పుడూ వివరించేవారు. వారు చెప్పిన రెండు సంఘటనలను ఇక్కడ ప్రస్తావిస్తాను: ఒకటి లాహోరు లోనో, లక్నోలోనో జరిగినది.

(ఈ రచన శ్రీ రమణాశ్రమము ద్వారా ప్రచురింప బడిన 'మై రికలక్షన్స్ ఆఫ్ భగవాన్ శ్రీ రమణ మహర్షి' అనబడే గ్రంథము నుండి అనువదింపబడినది.)

# శ్రీరమణ మహర్షి యొక్క భక్తాగ్రేసరులు

# స్వామి ముక్తానంద

**మల్లాది ఫణిమాల**

స్వామి ముక్తానందులవారు బొంబాయి సమీపంలోని గణేష్ పురి ఆశ్రమ స్థాపకులు. స్వామి శ్రీ ముక్తానందులవారు జ్ఞాన భాస్కరులైన శ్రీరమణుల సన్నిధిలో, వారి వీక్షణామృతాన్ని ఆత్రుతతో గ్రోలుతూ కైలాససీమ వంటి శ్రీరమణాశ్రమంలో కైలాసాధిపతి అయిన శ్రీరమణ మహాదేవుని పాదాల చెంత మూడు రోజులు గడపగలిగిన అదృష్టవంతులు.

వారి అనుగ్రహ నీడలో గడిపిన మూడు రోజులలో స్వామి ముక్తానందుల వారు భగవద్రమణ మహర్షి పరమాద్వైతులనియూ, పరబ్రహ్మస్వరూపులనియు తెలుసుకోగలిగారు. ఎవరైనా భగవద్ర మణుల సన్నిధానినికి వెళితే సర్వాతీత స్థితిలో చింతావిహీనులైన వారి మహనీయ స్థితిని తప్పక గ్రహిస్తారు. కొందరు శ్రీరమణులను సిద్ధులని, మహాయోగులని అంటారు. మరికొందరు వారు భగవదావతారమని కూడా అంటారు. శ్రీరమణుల పాదాల చెంతకు వెళ్లిన వారెవరైనా రమణులు వారి స్వంతమని అనుకోవటం ఎంతో సహజమని, నిజంగానే శ్రీరమణులు అందరికీ చెందినవారు.... అందరూ వారికి చెందిన వాళ్లేనని స్వామి ముక్తానందుల వారు అంటూండేవారు. ఈ సందర్భంలో శ్రీరమణ పరావిద్యోపనిషత్ లోని ఈ శ్లోకము అనుసంధేయము...

మృత్యుంజయో సౌ త్రిపురాంత కోసౌ స్మరాన్తకోసౌ నరకాన్తకశ్చ।
సహీశ్వరాణమపి చాత్మభూతస్తమేవ సర్వేపి హి పూజయంతి॥

ఈయన మృత్యుంజయులు! త్రిపురాంతకులు! మన్మథాంతకులు. ఇతడు నరకాంతకుడు (విష్ణువు) ఇతడు గొప్ప దేవతలకు ఆత్మ! ఇతనినే అందరూ పూజింతురు.

శ్రీరమణ పరావిద్యోపనిషత్ లోని ఈ శ్లోకార్థమునకు ఉదాహరణమనదగినవారు మన గురు రమణులు.

అందరి మనసులలో పరమ గౌరవనీయమైన స్థానాన్ని ఆక్రమించుకున్న లోక మహా గురువులు శ్రీ రమణులు. వారి దివ్యత్వం అందరి ప్రేమను చూరగొన్నది! అసలు 'రమణ' అంటే రమించేవారని అర్థం. "రమతే ఇతి రమణ...." వారిని ఆత్మ అనవచ్చు. గురువు అని కూడా అనవచ్చు. రెండు ఒకటే కదా... అన్నది స్వామి ముక్తానందుల వారి అభిప్రాయం.

స్వామి ముక్తాందుల వారు స్వామి నిత్యానందుల వారి శిష్యులు. వారికి శ్రీరమణులను సోఫా మీద జారగిలి ఉన్నప్పుడు వారిని దర్శించుకున్నప్పుడల్లా, ఒక్క కౌపీనాన్ని మాత్రం ధరించి ఎంతో విలువైన దుస్తులను ధరించిన రాకుమారుని కంటే ఆకర్ష వంతంగా భాసిల్లుతున్నట్లుగా శ్రీరమణులు దర్శనమిచ్చేవారు. కేవలం ఒక కౌపీనాన్ని మాత్రమే ధరించి ఒక చక్రవర్తిలా దర్శనమిచ్చే శ్రీరమణుల వైభవానికి స్వామి ముక్తానందుల వారి గురువైన నిత్యానందుల వారు ఒకే ఒక కారణం చెప్పేవారు. అదేమిటంటే శ్రీరమణులు దేహాత్మ భావనారహితులు...గుణాతీతులు... దివంద్వతీతులు.... అంటే వారు దేహం కన్నా పై తలంలో రమిస్తూ ఉండేవారు. వారికి దేహపరమైన బాధ గానీ, ధ్యాస గానీ లేవు. శ్రీరమణులు రమించే ఆ తలం మన బోటి సాధారణమైన వాళ్లకి అందుబాటులో ఉండదు. అందుచేతనే శ్రీరమణులు కేవలం ఒక

కౌపీనాన్ని ధరించినప్పటికీ వారు నిత్యం రమించే ఆత్మ సామ్రాజ్యానికి చక్రవర్తి లాగా కనిపించేవారు.

స్వామి నిత్యానందుల వారు శ్రీరమణుల విశిష్టతను వర్ణిస్తూ చెప్పే ఈ మాటలు వారి శిష్యులైన స్వామి ముక్తానందుల వారు ఎప్పుడూ తలుచుకుంటూనే ఉండేవారు. శ్రీరమణుల వైభవాన్ని ఆవిష్కరిస్తూ స్వామి ముక్తానందులవారు ఇలా అన్నారు. "ఆత్మ సాక్షాత్కారం పొందటం శ్రీరమణుల బోధనలో ముఖ్యాంశం. వారి చెంతకు వచ్చి శరణు వేడిన వారందరికీ ఎటువంటి దాపరికము లేకుండా ఆత్మపట్ల ధ్యానమగ్నమై ఉండమని మాత్రమే శ్రీరమణులు సలహానిచ్చేవారు. ఆత్మను సభక్తికంగా ఆరాధించమనే వారు. వేదాంతం ప్రకారం ఆత్మ తప్ప తెలుసుకోవలసినదిగాని, వినవలసిందిగాని, చూడవలసినదిగాని ఏదీ లేదు అని సుస్పష్టంగా తేల్చి చెప్పారు శ్రీరమణులు.

మహర్షి బోధించిన ఆత్మ విచార మార్గం అందరికీ ఎల్లవేళలా అందుబాటులోనే ఉంటుంది. వారు నిత్య సత్యాన్ని బోధించడమే దీనికి గల కారణం. ఆత్మ ఎల్లవేళలా ఏ అడ్డు లేకుండా ఉంటూనే ఉంటుంది. అన్ని పరిస్థితులలోనూ, ప్రతి చోట ఉండటమే ఆత్మ యొక్క లక్షణం. కొందరికి రమణులు చేసే ఈ బోధ అతి ప్రాచీనంగా కనబడవచ్చు. మరికొందరికి ఎంతో ఆధునికంగా గోచరించవచ్చు. వాస్తవానికి అది ప్రాచీనము నవీనము కూడా అని స్వామి ముక్తానందుల వారు అన్నారు. ఎందుచేతనంటే అసలు ఈ ప్రాచీనము, నవీనము అనే భావాలు ఆత్మపై ఇతరులు వేసినవి మాత్రమే. నిజం ఏమిటంటే ఆత్మ వయస్సు కానీ, కాలంగానీ లేనిది!

శ్రీరమణులు వందనీయులైన మహాత్ములనియు, వారిని ఆరాధించిన వారికి జ్ఞానము, యోగము, భక్తి -- వీటి వల్ల కలిగే పరమానందం ఖచ్చితంగా లభిస్తుందనీ స్వామి ముక్తానందుల వారు ఘంటాపథంగా చెప్పారు.

××××

*గౌరీదేవితో గౌతమ ముని ఇలా పలికెను.*

*"ఓ గౌరీ! సమస్త జనులకు అన్ని అభీష్టాలను సిద్ధింపచేసి, సకల పాపములనుండి మరియు జనన మరణ చక్రము నుండి విముక్తిని ప్రసాదించే విధానమును నేను ఇప్పుడు నీకు వివరించెదను, వినుము. కృత్తికా దీపాన్ని వెలిగించే మహా దీపము నాటి రోజు అరుణ గిరిప్రదక్షిణ చేయువారికి పునర్జన్మ ఉండదు. వారి కర్మశేషమంతయు గిరిప్రదక్షిణ చేసిన కారణంగా నశించును.*

*మండలము అనగా 40 రోజుల పాటు గిరిప్రదక్షిణ చేయడం సంప్రదాయము. ఈ విధంగా చేయలేనివారు కార్తీక దీపం వెలిగించు రోజున అనగా కార్తీక పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ చేయవచ్చును. కార్తీక దీపోత్సవం రోజు చేసిన గిరిప్రదక్షిణ కోటాను కోట్ల యజ్ఞములను చేసిన దానితో సమానం! అరుణగిరిపై వెలిగించే కృత్తికా దీపమును దర్శించి, పూజించి, ఆరాధించిన భక్తులకు అసంఖ్యాకమైనటువంటి ఆశీర్వాదములు లభించును. ఇలా చేయలేనివారు మరియు అరుణాచలమునందు నివాసము ఉండలేని వారి గ్రామాలలో, ఊళ్లలో ఉన్న శివాలయములలో దీపములు వెలిగించుకోవచ్చు. అలా వీలు లేనివారు, తమ ఇళ్లలో దీపాలను వెలిగించవచ్చును.*

# "I am Nobody's Guru"

(Talk 118)

Dr K Subrahmanian

*yatpurvamsruti para darshi dhishano dvaipayano dhyaruhat*
*paschaad bodhakala vidhuta timirah shankapahah shankarah*
*tat samprat yakhilavani talajushaam acharya simhasanam*
*deva tvam prativeekshate naratano geervaana senapate*

Kavyakantha Ganapati Muni says,

*yat purvam sruti paradarshi dhishano dvaipayano dhyaruhat*

Our *adi guru* was Vyasa, and that is why g*uru purnima* is also called *Vyasa purnima*. Vyasa wrote the *Itihasa, the Puranas*, and also divided the one *Veda* into four. He did all this out of compassion for us; so, out of gratitude for him, we celebrate this day, and pay our respects to him. Kavyakantha says he is our *vedguru.*

*paschaat bodhakala vidhuta timirah shankapahah shankarah*

After Vyasa, Kavyakantha recognises only Adi Shankara as his *guru.* It is difficult to find another *guru* of the stature of Vyasa. According to Kavyakantha, if there is anyone, it is Shankara, for he cleared all our doubts.

*shruti smriti puranam alayam karunalayam*

*namami Bhagavadpadam Shankaram Lokashankaram*

Shankara, who was an *avatar*, lived for only 32 years. Shankara literally means 'one who does good for other people.' Adi Shankara was a treasure house of the *Vedas*, the *Puranas*, and of all knowledge; and his main job was to clear the doubts of people.

*Tat samprat yakhilavani talajushaam acharya simhasanam*

Kavyakantha says that after Shankara, however, there was no one to occupy the *acharya peetha*. It remained vacant till a person of Bhagavan's stature occupied it. This shows the extraordinary reverence that Kavyakantha had for Bhagavan.

On g*uru purnima*, we must think of all the *gurus*. Each one has his own *guru*, and we all get a *guru* by the grace of the Lord. We cannot choose a *guru;* the *guru* chooses us. Those who have come under the influence of Bhagavan will not say that one *guru* is greater or inferior to another *guru*. If we are all here today participating in *guru purnima*, it is because of the grace of Bhagavan.

We all look to Bhagavan and pray for his grace. From time to time, we realise that even this prayer is due to his grace. Bhagavan said, "I am nobody's *guru*, and nobody is my disciple". There are two reasons why he said this. If I consider you my *sishya*, and you consider me your *guru*, then we are two individuals. The *guru* considers the *sishya* a separate entity. The *guru* identifies himself as the body, and the *sishya* considers himself as the body. The question of doing something for the *sishya* arises only if I consider

myself being very different from the *sishya*. We, at our level, cannot easily understand Bhagavan. All that we say about Bhagavan is true, but whatever we say is not the complete truth, it is only partial. Anyone who wishes to understand Bhagavan fully, will have to be a Bhagavan himself; otherwise, it is impossible. I cannot understand you, and you cannot understand me totally. This is true even of the relationship between husband and wife. No husband can say at any time that he has understood his wife completely. No wife can say she has understood her husband completely. When I say that I know somebody, what I mean is that I have some experience with him, and therefore, know how he reacts in certain situations. All I know is that he likes coffee and doesn't like something else. It is all very superficial; yet, all our relationships are built on such superficial understanding of another person. That is why, from time to time, we say to others, "I never thought he would do this," or, "I never thought my wife/husband would behave like this." What we must remember is that no individual is static; everyone is evolving in his or her own way.

Secondly, I cannot understand another person completely because I have not understood myself completely. I may say theoretically what I will do in a given situation, but what I actually do may be very different; it may even surprise me. This is the why at the end of nearly every day, we regret that we said something we never meant to. We wonder then why we said it, though we never wanted to. This is a mystery. We know ourselves very

